RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 110
Vol : 18
Issue : 110

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, బుధవారం 24 జూన్ 2026
Warangal, Wednesday 24 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED

పీపుల్స్ డైరీ దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు
- హనుమకొండ ◆ కరీంనగర్
- భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
- జనగామ ◆ మహబూబాబాద్
- హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859



## చేయూత పింఛన్ల ప్రక్షాళన!?

### సెర్ప్ సర్వేలో 93 వేల మందికి పైగా అనర్హులు!

- అక్రమాలకు అడ్డుకట్ట...
- తగ్గనున్న నిధుల దుర్వినియోగం
- వచ్చే నెల నుంచి కొత్త పెన్షన్లు?

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో అర్హులైన పేదలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్ల పంపిణీ వ్యవస్థలో భారీ ప్రక్షాళన మొదలైంది. లబ్ధిదారుల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు, నిధుల దుర్వినియోగం అవుతోందనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పెన్షన్ల పంపిణీలో పారదర్శకతను పెంచేందుకు, నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా సెర్ప్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లైవ్ అథెంటికేషన్ సర్వే ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. సర్వేలో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న వారిలో ఇప్పటివరకు ఏకంగా 93,624 మందిని అనర్హులుగా సెర్ప్ అధికారులు గుర్తించారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం వివిధ కేటగిరీల కింద 42 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా.. వారిలో నేరుగా బ్యాంకు ఖాతాల ద్వారా నిధులు పొందుతున్న వారు 19,04,239 (మిగతా 2లో...)

## డిజిటల్ దూకుడు

- దేశంలో 109 కోట్లు దాటిన ఇంటర్నెట్ వినియోగదారులు
- మెట్రో నుంచి గ్రామం దాకా విస్తరించిన ఇంటర్నెట్
- టెలికామ్ తరంగాల్లో పుంజుకుంటున్న ఆర్థిక శక్తి
- అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న యుగమిది...
- కొనసాగుతున్న అంతర్జాల విప్లవం
- మూడు నెలల్లో 6 కోట్లకు పైగా కొత్త యూజర్లు..
- ట్రాయ్ నివేదికలో సంచలన గణాంకాలు




**పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ :** భారత టెలికామ్ రంగం అప్రతిహత వృద్ధిని కొనసాగిస్తోంది. దేశంలో ఇంటర్నెట్, టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తన తాజా నివేదికలో వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2026 మార్చి నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 109.27 కోట్లకు చేరింది. 2025 డిసెంబర్ చివరి నాటికి ఈ సంఖ్య 102.86 కోట్లుగా ఉండగా.. కేవలం మూడు నెలల్లోనే 6.24 శాతం వృద్ధి నమోదైంది.

ట్రాయ్ నివేదిక ప్రకారం.. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారులలో 104.62 కోట్ల మంది వైర్‌లెస్ ద్వారా, 4.65 కోట్ల మంది వైర్డ్ కనెక్షన్ల ద్వారా ఇంటర్నెట్ సేవలు పొందుతున్నారు. వీరిలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 106.58 కోట్లుగా ఉండగా.. న్యారోబ్యాండ్ (56 కేబీపీఎస్ కంటే తక్కువ వేగం) సబ్‌స్క్రైబర్లు 2.69 కోట్లుగా ఉన్నారు. త్రైమాసిక ప్రాతిపదికన బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల బేస్ 5.81 శాతం పెరగడం విశేషం. ఇంటర్నెట్‌తోపాటు మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కూడా 133.05 కోట్లకు పెరిగింది. దాంతో దేశవ్యాప్తంగా టెలి–డెన్సిటీ (ప్రతి 100 మందికి ఉన్న ఫోన్ కనెక్షన్లు) గత (మిగతా 2లో...)



## విజిట్రబుల్..

- వర్షాలు లేక పడిపోయిన దిగుబడి
- మండుతున్న కూరగాయల ధరలు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :**

ఎల్‌నినో ఎఫెక్ట్‌తో తెలంగాణలో కూరగాయల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా జూన్ నెలలో కురవాల్సిన వర్షాలు ఈసారి జాడ లేకపోవడంతో కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతింటోంది. నీటి కొరత, పెరిగిన సాగు ఖర్చులు, తగ్గిన దిగుబడి అంతా కలిపి కూరగాయల భోజనం చేయాలంటే సామాన్యుడి జేబు ఖాళీ అవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణలో కూరగాయల దిగుబడి గణనీయంగా పడిపోయింది. చిక్కుడు, టమాటా, బీన్స్, క్యాబేజీ లాంటి కూరగాయల ఉత్పత్తి తగ్గిపోయింది. (మిగతా 2లో...)



## యూరియా యాప్ సరళీకరణ!



### సాగుకు సిద్ధమైన రైతులకు ఊరట..

#### గందరగోళం నేపథ్యంలో ఫర్టిలైజర్ యాప్‌లో మార్పులు..

#### ఇక యూరియా బుకింగ్ ఈజీ అట...

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన తరుణంలో రైతులకు సకాలంలో, పారదర్శకంగా ఎరువులను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో ఎదురైన ఇబ్బందులు, అక్రమాలను దృష్టిలో పెట్టుకుని ఖరీఫ్ సాగు సమయానికి ఎరువుల పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసింది. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ లో కీలక మార్పులు, అప్‌డేట్‌లను తీసుకొచ్చారు. గతంలో ఈ యాప్ ద్వారా ఎక్కడి వారైనా, ఏ ప్రాంతంలోనైనా యూరియా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో.. స్థానిక రైతులకు ఎరువులు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను అధిగమించడానికి ప్రస్తుత సీజన్ నుంచి మండల యూనిట్ విధానాన్ని అమలుల్లోకి తీసుకొచ్చారు.

దీనివల్ల రైతులు కేవలం తమ సొంత మండల పరిధిలోనే యూరియా బుకింగ్ చేసుకోవడానికి వీలుంటుంది. ఫలితంగా స్థానిక రైతులకు సకాలంలో ఎరువుల కోటా దక్కనుంది. గతంలో కొందరు ఎరువుల డీలర్లు తమకు తెలిసిన వారికి ముందే సమాచారం అందించి ఆన్‌లైన్‌లో తప్పుడు లెక్కలు చూపిస్తూ (మిగతా 2లో...)

## బాసర ఆలయంలో చోరీ

2లో

- అమ్మవారి వెండి కిరీటం, హుండీ అపహరణ!
- ఆలయ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం



## ఏటీఎంలో పెట్టాల్సిన డబ్బులు చోరీ..

- రూ.17 లక్షలతో వ్యాన్ డ్రైవర్ పరారీ
- పక్కా ప్లాన్‌తో దొంగతనం..!

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో ఉన్న ఏటీఎంలలో నగదును నింపే.. ఒక క్యాష్ మేనేజ్‌మెంట్ వ్యాన్ డ్రైవర్.. మిగిలిన సిబ్బందిని ఏమార్చి రూ.17 లక్షల డబ్బుతో ఉడాయించాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపడమే కాకుండా.. ఏటీఎంలలో నగదు తరలింపు భద్రతపై మరోసారి పలు ప్రశ్నలను లేవనెత్తింది. ఈ చోరీకి సంబంధించి ఫిర్యాదు అందడంతో రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఆ దొంగలను పట్టుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రెయిన్ బజార్–సంతోష్ నగర్ ప్రధాన రహదారిపై ఈ భారీ డబ్బుల సంఘటన చోటుచేసుకుంది. ఏటీఎంలలో నగదును నింపేందుకు (మిగతా 2లో...)

## జొన్నగిరి... సీమలో కనక లోగిలి

- బంగారు గనులతో ఏపీకి మస్తు ఆదాయం
- అక్కడ సుమారు 50 టన్నుల బంగారు నిక్షేపాలు!
- నేడు చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

**పీపుల్స్‌డైరీ–ఏపీ బ్యూరో :** కరవు సీమ రాయలసీమలో బంగారు పంటలు పండను న్నాయి. దేశంలోనే తొలి ప్రైవేట్ బంగారు గనిగా పేరొందిన.. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ బంగారం ఉత్పత్తికి సిద్ధమైంది. సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బుధవారం జొన్నగిరి బంగారు గనులు ప్రారంభం కానున్నాయి. కర్నూలు జిల్లా జొన్నగిరితో పాటుగా మరికొన్నిచోట్ల బంగారు నిక్షేపాలను గుర్తించిన నేపథ్యంలో రాబోయే రోజులలో దేశంలోనే అతిపెద్ద బంగారం సరఫరాదారుగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని అధికారుల అంచనా. ఇక జొన్నగిరిలో సుమారుగా 50 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నట్లు ఏపీ గనుల శాఖ అంచనా వేస్తోంది. జొన్నగిరితో పాటుగా రామగిరి, జవ్వాకుల, చిగురుకుంట బిస్నాతం ప్రాంతాలలో బంగారు నిక్షేపాలను గుర్తించినట్లు ఏపీ గనుల శాఖ ముఖ్య (మిగతా 2లో...)

# చేయూత పెన్షన్ల ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)



మంది ఉన్నారు. ఈ బ్యాంకు ఖాతాల జాబితా ఆధారంగానే సెర్ప్ ప్రత్యేకంగా ఒక అధునాతన మొబైల్ యాప్‌ను రూపొందించి గత నెల ఆరంభంలో ఈ మెగా సర్వేను ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి లైవ్ అథెంటికేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లబ్ధిదారుల్లో 15,97,233 మందికి సంబంధించిన సర్వే విజయవంతంగా పూర్తయింది. ఈ నెలాఖరు నాటికి వంద శాతం సర్వేను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ సర్వే నివేదికల ప్రకారం ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు లేని విచిత్రమైన పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. అనర్హులుగా తేలిన 93,624 మంది వివరాలను అధికారులు గుర్తించగా.. పెన్షన్లు పొందుతున్న వారిలో 40,751 మంది ఇప్పటికే చనిపోయినట్లు తేలింది. అయినా వారి పేరిట నిధులు డ్రా అవుతుండటం గమనార్హం. సుమారు 41,689 మంది లబ్ధిదారులు తాము ఇచ్చిన చిరునామాల్లో నివసించడం లేదు. వారి అసలు ఆచూకీ ఎక్కడా దొరకలేదు. మరో 11,184 మంది ఆధార్ కార్డులు సాంకేతికంగా చెల్లుబాటు కావడం లేదు. కానీ వారి ఖాతాల్లోకి డబ్బులు జమ అవుతున్నాయి. వీరంతా కాకుండా మరో 3,475 మంది ఇతర పొరుగు రాష్ట్రాలకు శాశ్వతంగా వలస వెళ్లిపోయినప్పటికీ.. తెలంగాణ ప్రభుత్వం నుంచి రెగ్యులర్‌గా పెన్షన్లు అందుకుంటున్నారు.

మరోవైపు గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ సెర్ప్ సిబ్బంది ఈ సర్వే నిర్వహిస్తుండటంతో స్థానిక వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు పెద్ద ఎత్తున అధికారులను ఆశ్రయిస్తున్నారు. తమకు కూడా పెన్షన్ పొందేందుకు అర్హత ఉందని, తమ పేర్లను కొత్తగా నమోదు చేయాలని వినతిపత్రాలు అందిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం.. ఈ నెలాఖరుతో అనర్హుల తొలగింపు ప్రక్రియను ముగించి వచ్చే నెల మొదటి వారం నుంచి కొత్త పెన్షనర్ల ఎంపిక ప్రక్రియను ప్రారంభించేందుకు ముమ్మర సన్నాహాలు చేస్తోంది. అర్హత ఉండి దరఖాస్తు చేసుకునే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# బాసర ఆలయంలో చోరీ..

- అమ్మవారి వెండి కిరీటం, హుండీ అపహరణ!
- ఆలయ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం



**పీపుల్స్‌డైరీ-నిర్మల్ :** తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం వెలుగులోకి వచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయ ఆవరణలో గుర్తుతెలియని దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. సరస్వతీ దేవి ఆలయ పైఅంతస్తులో కొలువై ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడిని టార్గెట్ చేసిన దుండగులు.. పక్కా స్కెచ్‌తో లోపలికి చొరబడి అమ్మవారి వెండి కిరీటం, హుండీ ఎత్తుకెళ్లారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఈ పుణ్యక్షేత్రంలో ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది.

ఆలయ వర్గాల కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటాక దొంగలు మహంకాళి ఆలయ ప్రధాన గేటు తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడిలోకి చొరబడిన దుండగులు అమ్మవారి అలంకరణకు ఉపయోగించే వెండి కిరీటాన్ని దొంగిలించారు. అంతటితో ఆగకుండా భక్తులు సమర్పించిన కానుకలతో ఉన్న ఆలయ హుండీని సైతం అలాగే పెకలించి ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణం వెలుపలికి వెళ్లిన దొంగలు.. హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదు మొత్తాన్ని కాజేశారు. అనంతరం ఖాళీ హుండీని సమీపంలోని వ్యాసగుడి వద్ద పడేసి.. అక్కడి నుంచి చాకచక్యంగా పరారయ్యారు.

మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు నిత్య పూజల నిర్వహణ కోసం, సుప్రభాత సేవ ముగించుకుని పైఅంతస్తులోని మహంకాళి గుడికి వెళ్లడంతో ఈ దొంగతనం ఘటన వెలుగులోకి వచ్చింది. ఆలయ సింహద్వారం గేటు విరిగిపోయి ఉండటం, గర్భగుడిలో సామాగ్రి అంతా చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి అర్చకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అమ్మవారి కిరీటం, హుండీ మాయమైనట్లు గుర్తించి వారు వెంటనే ఆలయ ఉన్నతాధికారులకు, ఈవోకి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆలయ అధికారులు తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. ముందస్తు ఆధారాల కోసం ప్రత్యేక క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో గట్టి నిఘా ఉన్నప్పటికీ దొంగలు ఇంత సాహసానికి ఒడిగట్టడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో, వెలుపల ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అంతర్గత భద్రతా సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించారా? లేదా స్థానికుల హస్తం ఏదైనా ఉందా? అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. కాగా, ఈ ఘటనతో బాసర క్షేత్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏటీఎంలో పెట్టాల్సిన డబ్బులు చోరీ..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన సిబ్బందిలో ఒకరు పక్కా ప్లాన్ ప్రకారం.. ఆ డబ్బును కొట్టేశారు. ఆ క్యాష్ వ్యాన్ డ్రైవర్.. ముందుగానే వేసుకున్న ప్లాన్ ప్రకారం.. నగదును ఎత్తుకెళ్లిపోయాడు. ఏటీఎంలలో నింపాల్సిన రూ.17 లక్షలతో కూడిన డబ్బు పెట్టెను తీసుకుని పారిపోయాడు.

వ్యాన్ ఏటీఎం వద్దకు చేరుకున్న తర్వాత.. డబ్బు నింపే సిబ్బంది ఏటీఎం లోపలికి వెళ్లారు. అదే సమయంలో అటు వైపుగా ఒక బైక్ రాగా.. ఆ వ్యాన్‌లోని డబ్బు పెట్టెను తీసుకుని అక్కడి నుంచి పారిపోయారు. సిబ్బంది వచ్చి చూసేసరికి వ్యాన్‌లో డబ్బుల బాక్స్ కనిపించలేదు. అదే సమయంలో వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకపోవడంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వెంటనే ఈ దోపిడీపై ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఐఎస్ సదన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడైన వ్యాన్ డ్రైవర్‌ను తొందరగా పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. సంతోష్ నగర్ మెయిన్ రోడ్డు సహా ఆ ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. ఆ బైక్ నంబర్, నిందితుడు ఏ మార్గంలో వెళ్లాడో గుర్తించే పనిలో పడ్డారు. ఇక పరారీలో ఉన్న వ్యాన్ డ్రైవర్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలింపు చేపట్టారు.



# వెజి'ట్రబుల్'...

(మొదటి పేజీ తరువాయి)

వర్షాభావంతో చిక్కుడు పంటలు ఎండిపోతుండగా, టమాటా దిగుబడి కూడా పూర్తిగా పడిపోయింది. మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్‌లో 50 నుంచి 60 రూపాయల మధ్య ఉన్న టమాటా, ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వస్తే తప్ప హైదరాబాద్ మార్కెట్‌లో దొరకని పరిస్థితి ఏర్పడింది. బీన్స్ రైతు బజార్లోనే కిలో 100 రూపాయలు ఉండగా, రిటైల్ మార్కెట్‌లో 150 నుంచి 180 రూపాయల వరకు అమ్ముడవుతోంది. చిక్కుడు కాయ కూడా రైతు బజార్లో 70 నుంచి 80 రూపాయలు ఉండగా, బయట మార్కెట్‌లో 150 రూపాయల వరకూ పలుకుతోంది. రైతు బజార్లలో సరుకు లేకపోవడంతో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. బోర్ నీళ్లనే వర్షం మాదిరిగా స్ప్రే చేస్తూ పంటలను బతికించే ప్రయత్నం చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఎల్‌నినో పరిస్థితులు వస్తాయని ఆరు నెలల కిందటే హెచ్చరికలు వచ్చాయని, అందుకే పంటల మార్పిడిపై దృష్టి పెట్టామని రైతులు చెబుతున్నారు. వేసిన పంటలు కూడా మొలకెత్తే పరిస్థితి లేదంటున్నారు.

ఒకప్పుడు తెలంగాణలో 5 లక్షల ఎకరాల్లో పండిన కూరగాయలు 2025 సంవత్సరానికి 50,000 ఎకరాలకు పడిపోయింది. హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు ఒకప్పుడు హార్టికల్చర్‌కు కేంద్రంగా ఉండేవి. కానీ రియల్ ఎస్టేట్ విస్తరణతో కూరగాయల సాగు క్రమంగా తగ్గిపోయిందని రైతు కమిషన్ సభ్యులు చెబుతున్నారు..

ప్రభుత్వం కూడా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు ప్రారంభించిందని అంటున్నారు. యాచారం మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన కూరగాయల సాగు విస్తీర్ణం మూడు రెట్లు పెరిగినట్లు రైతు కమిషన్ మెంబర్లు చెబుతున్నారు. ఎల్‌నినో పరిస్థితులతో.. దిగుబడి తగ్గడంతో పాటు.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూరగాయల దిగుమతులు తగ్గి.. కొరత తీవ్రమయ్యే అవకాశాలున్నాయి. రాబోయే రెండు మూడు నెలల్లో కూరగాయల ధరలు మరింత భగ్గుమనే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పరామర్శ

వరంగల్, జూన్ 23 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మండల పరశురాములు, మండల నరసింహారాములు సోదరుల తండ్రి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని మంగళవారం వారి నివాసానికి బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, మండల అధ్యక్షులు తాళ్లపల్లి అర్జున్, బోరిగం నాగరాజు సీనియర్ నాయకులు బక్కి రంజిత్ కర్నే రవీందర్, శ్రీరామోజీ మోహన చారి, పరమేష్, తాటికొండ ప్రసాద్, జూలూరి నైనేష్, లక్ష్మణ్, లక్కాకుల రాజు, ఆదిత్య చిన్న,కర్నె వరుణ్ , శ్రీనివాస్, వెంకటేష్, కార్తీక్ స్థానిక నాయకులు పాల్గొని నివాళులు అర్పించారు.





# డిజిటల్ దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

త్రైమాసికంలోని 91.74 శాతం నుంచి 93.26 శాతానికి మెరుగుపడింది. వైర్‌లైన్ టెలిడెన్సిటీ సైతం 3.33 శాతం నుంచి 3.38 శాతానికి పెరిగింది. వినియోగదారుల నుంచి వచ్చే సగటు నెలవారీ ఆదాయం కూడా టెలికామ్ సంస్థలకు సానుకూలంగా ఉంది. వైర్‌లెస్ సేవలకు సంబంధించి ఏఆర్‌పీయూ 0.76 శాతం పెరిగి రూ.196.04కి చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 7.15 శాతం పెరుగుదల. అదేవిధంగా వినియోగ సమయం కూడా స్వల్పంగా పెరిగి నెలకు సగటున 1,017 నిమిషాలకు చేరింది.

టెలికామ్ రంగం వృద్ధి ప్రభుత్వ ఆదాయానికి కూడా ఊతమిచ్చింది. 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో టెలికామ్ కంపెనీల నుంచి లైసెన్స్ ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.6,936 కోట్ల ఆదాయం లభించింది. అంతకుముందు త్రైమాసికంలో ఇది రూ.6,733 కోట్లుగా ఉంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన 917 ప్రైవేట్ శాటిలైట్ టీవీ ఛానెళ్లు దేశంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయని కూడా ట్రాయ్ తన నివేదికలో పేర్కొన్నది.

# యూరియా యాప్ సరళీకరణ!

(మొదటి పేజీ తరువాయి)



నిల్వలను ఆఫ్‌లైన్ ద్వారా పక్కదారి పట్టించేవారనే ఆరోపణలు వచ్చాయి. దీన్ని నిరోధించేందుకు ప్రభుత్వం యాప్‌లో అదనపు సెక్యూరిటీ, టైమ్ లాకింగ్ ఫీచర్లను జోడించింది. ఇకపై డీలర్లు తమ వద్ద ఉన్న యూరియా స్టాక్‌ను మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసినా.. అది రైతులకు మరుసటి రోజు ఉదయం 7 గంటలకే స్క్రీన్‌పై కనిపిస్తుంది. అలాగే ఉదయం 7 గంటల తర్వాత ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తే.. అది మధ్యాహ్నం 3 గంటలకే రైతులకు అందుబాటులోకి రానుంది. ఈ నిబంధన వల్ల ఎరువుల నిల్వలపై పారదర్శకత పెరగనుంది. రైతులు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యాప్ ఓపెన్ చేసి తమకు కావలసిన యూరియాను సులభంగా బుక్ చేసుకోవచ్చు.

గతంలో పలువురు రైతులు, వ్యాపారులు యూరియా కొరత వస్తుందనే భయంతో పంటల నమోదు సమయంలో మొక్కజొన్న పంటను ఎంపిక చేసుకునేవారు. ఎందుకంటే మొక్కజొన్న సాగు చేసే రైతులకు ఎకరాకి 5 బస్తాల యూరియా అందించే వెసులుబాటు ఉండేది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు అవసరం లేకపోయినా ఎక్కువ బస్తాలను పొంది నిల్వ చేసుకునేవారు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవసాయ శాఖ ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఈ వానాకాలం సీజన్ నుంచి రైతులు ఏ పంట సాగు చేసినా సరే.. ఎకరానికి కేవలం 2 బస్తాలు మాత్రమే బుకింగ్ అవుతాయి. ఒక ఎకరం భూమి ఉన్న రైతుకు ఒకే విడతలో గరిష్టంగా రెండు బస్తాలు మాత్రమే బుకింగ్ చేసుకునేలా యాప్‌లో పరిమితి విధించారు.

సాంకేతిక ఇబ్బందులను తొలగించడంలో భాగంగా ఐటీ విభాగాధికారులు ఈ ఫర్టిలైజర్ యాప్‌ను పూర్తిగా అప్‌డేట్ చేశారు. గతంలో యూరియా బుకింగ్ చేసే సమయంలో ప్రతిసారీ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ వచ్చే వరకు వేచి చూడాల్సి వచ్చేది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల ఓటీపీలు సకాలంలో రాక రైతులు బుకింగ్ చేసుకోలేకపోయేవారు. ఈ సమస్యను పరిష్కరిస్తూ.. ఇకపై ప్రతిసారి ఓటీపీతో లాగిన్ అవ్వాల్సిన అవసరం లేకుండా, రిజిస్టర్డ్ మొబైల్ ద్వారా నేరుగా యాప్‌లోకి ప్రవేశించి కేవలం కొన్ని క్లిక్‌లతోనే యూరియా బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జొన్నగిరి... సీమలో కనక లోగిలి

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా చెప్తున్నారు. జొన్నగిరిలో 1500 ఎకరాలను బంగారు గనుల తవ్వకం కోసం పదేళ్ల కిందటే ఏపీ ప్రభుత్వం కేటాయించింది. అయితే కేటాయించిన భూమిలో ఇప్పటివరకు కేవలం 500 ఎకరాల పరిధిలో మాత్రమే బంగారం అన్వేషణ కోసం చర్యలు చేపట్టారు. ఈ 500 ఎకరాలలో 13 టన్నుల వరకు బంగారం ఉండే అవకాశం ఉందని అధికారుల అంచనా. మిగతా వేయి ఎకరాల్లో బంగారాన్ని అన్వేషించే పనులను తర్వాతి దశలో చేపట్టనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తి అయితే.. 1500 ఎకరాలలో నిక్షిప్తమైన 50 టన్నుల బంగారాన్ని వెలికి తీయనున్నారు.

బంగారు గనుల తవ్వకానికి భారీ పెట్టుబడి, ప్రత్యేక నైపుణ్యం అవసరం ఉంటుంది. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ద్వారా ప్రైవేట్ సంస్థలకు ఈ బాధ్యతలను అప్పగించింది. అలాగే గత కొన్నేళ్లుగా బంగారం వెలికితీతతో గణనీయమైన తగ్గుదల ఉన్నట్లు ముకేష్ కుమార్ మీనా చెప్తున్నారు. గతంలో ఒక టన్ను మట్టి నుంచి సుమారు మూడు గ్రాముల బంగారం లభించేదని.. ప్రస్తుతం ఆ రేటు టన్నుకు ఒక గ్రాముకు పడిపోయిందంటున్నారు. ఒక టన్ను మట్టి నుంచి లభించే బంగారం పరిమాణం 0.8 గ్రాముల కంటే తక్కువకు పడిపోతే, మైనింగ్ కార్యకలాపాలు లాభదాయకం కాకుండా పోతాయని ముఖేష్ కుమార మీనా వివరించారు.



# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

**సైదాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిత తనిఖీ- డిహెచ్ఎంవో డాక్టర్ శ్రీరామ్**



**సైదాపూర్ జూన్ 23 ( పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ , ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి హుజురాబాద్ డివిజన్ డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ శ్రవణ్ కుమార్ డిడిఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సైదాపూర్ ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్, రక్త పరీక్షల గది, నమూనా సేకరణ, వ్యాక్సిన్ రూమ్, మందుల గది పర్యవేక్షించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందిని రాబోవు సీజన్ వ్యాధుల దృష్ట్యా సమయపాలన పాటించాలని, పాము కాటు తేలుకాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కృష్ణ కుమార్ డాక్టర్ కృష్ణారావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# నర్సింగాపూర్ లో అంగరంగ వైభవంగా పీరిల పండుగ వేడుకలు



**వీణవంక జూన్ 23( పీపుల్స్ డైరీ) :** మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పీరీల పండుగ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడ ఇంటింటికి తిరుగుతూ పీరీలను ఇంటి వద్దకు తీసుకొని పోయి ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులను ఆశీర్వదించడంతో పాటు గ్రామంలో ఉన్న ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గ్రామంలో పీరీల ఉత్సవం కనుల పండుగగా జరుగగా ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియామకానికి అభినందనలు



**శంకరపట్నం జూన్ :23 పీపుల్స్ డైరీ :** టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సముద్రాల లక్ష్మణ్‌ను శంకరపట్నం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొత్స చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి అభినందనలు తెలియజేసి, పార్టీ పట్ల ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు చేపట్టడం శంకరపట్నం మండలానికి గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# భీమయ్యకు ఘన సన్మానం



**జమ్మికుంట.,జూన్ 23(పీపుల్స్ డైరీ :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన పైడిపల్లి భీమయ్యకు ఆర్ఎంపి, పిఎంపి అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా, అలాగే ఇల్లంతకుంట ప్రెస్ రిపోర్టర్‌గా నంది అవార్డు అందుకున్న సందర్భంగా ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతుల శ్రీనివాస్, లింగాల లింగారావు, బండి పవన్, మారెపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భీమయ్యను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# కరీంనగర్ జిల్లాలో రాజ్యాధికార సమరభేరి వాల్ పోస్టర్ ఆవిష్కరణ

- **భువనగిరి సభ విజయవంతానికి కరీంనగర్ జిల్లా టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశం**
- **జులై 05న భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ చారిత్రాత్మక విజయాన్ని సాధించాలి -- టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్**



**కరీంనగర్. జూన్. 23పీపుల్స్ డైరీ :** జులై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణక్క ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజినీకుమార్ యాదవ్ మరియు రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగిపెల్లి అరుణక్క మాట్లాడుతూ, బీసీల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే సభ భువనగిరి రాజ్యాధికార సమరభేరి అని అన్నారు. కరీంనగర్ జిల్లా నుండి కనీసం 5 వేల మంది బీసీ ప్రజలు సభకు తరలివచ్చేలా ప్రతి గ్రామంలో, ప్రతి బస్తీలో విస్తృత ప్రచారం చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అఖిల్ పాషా మాట్లాడుతూ, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం అందించే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని అన్నారు. బహుజన వర్గాల స్వాభిమానాన్ని కాపాడుతూ వారికి అధికార భాగస్వామ్యం కల్పించేందుకు పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. మాధం రజినీకుమార్ యాదవ్ మాట్లాడుతూ, జులై 05న భువనగిరిలో జరిగే రాజ్యాధికార సమరభేరి సభ తెలంగాణ రాజకీయ చరిత్రలో మరో కీలక ఘట్టంగా నిలవబోతుందని అన్నారు. రాబోయేది బీసీ రాజ్యమేనని, బహుజన వర్గాల పాలనకు భువనగిరి సభ నాంది పలుకుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని స్పష్టం చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో జులై 05న భువనగిరికి తరలివచ్చి రాజ్యాధికార సమరభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జింక లావణ్య కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, వైస్ ప్రెసిడెంట్ ఇరుగుదుండ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి నాతరి రాధా, మహిళా కార్యదర్శి మహమ్మద్ ఇస్రాత్, మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హర్షద్బిన్ అలీ ,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకుష్, యూత్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, మహబూబ్ అలీ, టౌన్ ప్రెసిడెంట్ కొత్తకొండ వేణు, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, కొత్తపెల్లి మండల్ అధ్యక్షుడు ఓర్స రాజు, దండంగుల మోహన్, దండం గులా మురళి, ఓర్స్ కార్తిక్, ఓర్స్ విమల, అమ్మిగళ్ళ కుమార్, కొప్పుల వెంకటేష్, గంగధర మండల్ అధ్యక్షుడు ముక్కెర గంగరాజు, సోషల్ మీడియా కన్వీనర్ గుండా సతీష్, చొప్పదండి మండల్ అధ్యక్షుడు దామర అనిల్, కొడిమ్యాల్ మండల్ అధ్యక్షుడు దుబ్బాక అరుణ్, తిమ్మాపూర్ మండల్ అధ్యక్షుడు శివరాత్రి మోహన్, ప్రధాన కార్యదర్శి దురుశెట్టి చందు, చిగురుమామిడి మండల అధ్యక్షుడు బుర్ర అశోక్, కొత్తకొండ శ్రీకాంత్, మొగిలి జలంధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# డి సీల్టింగ్ ఇసుక క్వారీ లు నిలిపి వేయకుంటే పోరాటం తప్పదు

- **గోదావరి నది భూగర్భ జలాల ధ్వంసం కోసమే ఇసుక మాఫియా డి సీల్టింగ్ కుట్రలు**
- **ఏటూరు నాగారం వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం లో ఇసుక లారీలు అర్ధరాత్రి కూడ నడుస్తుంటే జిల్లా కలెక్టర్ డీఎఫ్ఓ ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలి**

**ఏటూరు నాగారం జూన్ 24 (పీపుల్స్ డైరీ) :** గిరిజన సొసైటీలపై ఆధిపత్యం చెలాయిస్తూ నేనే రాజు నేనే మంత్రి అనే అధికార పార్టీ నేతలపై ప్రజా పోరాటం తప్పదు. తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ తీవ్ర హెచ్చరిక ములుగు జిల్లాలో గోదావరి నది పరివాహక ప్రాంతం లో భారత రాజ్యాంగ చట్టాలు హక్కులు అటవీ శాఖ నిబంధనలు అమలు అయ్యే పరిస్థితి లేదు ఈ క్రమం లో అక్రమ ఇసుక త్రవ్వాకాలపై తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మహిపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని నిబంధనలు తుంగలో తొక్కుతూ చట్టాలను ఉల్లంఘిస్తూ ఏటూర్ నాగారం వన్యపాణి సంరక్షణ కేంద్ర నిబంధనలు అతిక్రమిస్తూ పగలు రాత్రి తేడా లేకుండా ఇసుక లారీలు నడుస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అయినప్పటికీ కూడ చట్టాలను కాపాడాల్సిన జిల్లా కలెక్టర్ అటవీని, అటవీ ప్రాంతాన్ని సంరక్షించాల్సిన జిల్లా అటవీ శాఖ అధికారి ఏజెన్సీ ప్రాంత చట్టాలను వనరులను కాపాడాల్సిన ఐటిడిఎ పీవో ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. కేవలం పగలు మాత్రమే నడవాల్సిన ఇసుక క్వారీలు పగలు రాత్రి తేడా లేకుండా ఎలా నడుస్తాయని అన్నారు అడవిలో అనేక రకాల జంతుజాలం జీవజాలం ఉంటుందని అందులో వేగంగా పరిగెత్తే జంతువులు ఉంటాయి. నిదానంగా ప్రయాణించే జీవులు ఉంటాయి. అవి రాత్రి సమయం లో రోడ్డు దాటి సంచరించే క్రమంలో ఆ లారీల కింద పడి ఎన్ని జంతువులు నలిగిపోతున్నాయో అధికారులకు తెలియద అని మండిపడ్డారు అందుకే వన్యపాణి సంరక్షణ నిబంధనల ప్రకారం భారీ వాహనాలు రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు నిషేధించాలని నియమాలు వారికి తెలియదా అని ఘాటుగా ప్రశ్నించారు. గిరిజన సొసైటీల పేరిట ఇసుక తవ్వకాలు సరిపోక ఇటీవల కాలంలో గోదావరి నది భూగర్భ జలాలను దెబ్బ తీయడానికి రానున్న కాలంలో గోదావరి నదిని అందులో నీటిని లేకుండా చేయడానికి ఇసుక మాఫియా కుట్రలు పన్నిందని దాన్లో భాగంగానే ఎక్కడో కట్టే సీతారామ ప్రాజెక్టు వలన బ్యాక్ వాటర్ స్టోరేజ్ ఏటూరు నాగారం వరకి విస్తరించి ఉంటుందని దొంగ నివేదికలు సమర్పించి అక్రమంగా అందులో ఉన్న ఇసుకను డీసీల్టింగ్ పేరిట కొత్త క్వారీలకు అనుమతిని ఇచ్చి ఇసుకను ఎత్తుకు పోతున్నారని అన్నారు. ఇసుక కాంట్రాక్టర్ ల ఎంగిలి మెతుకులకు పర్యావరణ,భూగర్భ శాఖ మోకరిల్లి ఈ ప్రాంత వినాశన అనుమతులు మంజూరు చేశాయని మండి పడ్డారు. దీని ద్వారా భవిష్యత్తులో గోదావరి నది ఎండిపోవడమే కాకుండా గోదారి పరివాహక ప్రాంతంలో వాగులు వంకలు ఊట బావులు నీటి చెలిమలు అంతరించి పోవడమే గాక చెట్లు అడవులు నీరు అందక అంతరిస్తాయని అన్నారు జీవజాలం జంతుజాలం నీటి శాతం అందక అంతరిస్తాయని దానితో ఆదిమ తెగలు అంతరించే ప్రమాదం పొంచి ఉంది అన్నారు. ఇసుక లారీల అధిక లోడు అధిక స్పీడ్ కి అంతే లేదు అన్నారు అనేక మంది ఆదివాసీలు ఆ లారీల కింద పడి ముక్కలు ముక్కలు అవుతున్నారని అన్నారు అనేక పశువులు జంతువులు నెత్తురోడుతునాయని అన్నారు. కనీసం పర్యా విక్షణ లేదు అని అన్నారు అనేక క్వారీలు ఆదివాసీల సొసైటీ ల నిబంధనలకు విరుద్ధంగా బినామీల పేరిట నడుస్తున్నాయి అని అన్నారు బినామీ వ్యవస్థ తో గోదావరి తల్లి గోసరిల్లుతుంది అన్నారు. సొసైటీ యాక్ట్ ప్రకారం కేవలం ఇసుక త్రవకం మానువల్ గా జరగాలి కానీ కూలీలు ట్రాక్టర్ ల ద్వార గోదావరి నది లో ఇసుక బయట ఒడ్డు పై పోసినాక ఇసుక అమ్మకం చేయాలి కాని నేడు ఏకంగా గోదావరి నదిలోకి బారి ప్రోక్లియర్ లు లారీ లు వెళ్ళి గోదావరి సారూప్యాన్ని ద్వంసం చేస్తూ నిబంధనలు అతిక్రమించిన అధికారులు మాట్లాడే పరిస్తితి లేదు అన్నారు. 2016 నుండి 2026 వరకు నేటి వరకు ఆదివాసీలకు 64 ఇసుక క్వారీల లో రావలసిన 40 పర్సంట్ నిధి వాట 10 ఏళు అయిన నేటికి ఇవ్వడం చేత కాని ప్రభుత్వం డి సీల్టింగ్ కి అనుమతి ఎలా ఇస్తుందని అన్నారు ఆదివాసీల సొసైటీ కి రావాల్సిన వాట కోసం పోరాటం చేస్తాం అన్నారు అధికార పార్టీ నేతల్లో ముఖ్య నేతలు అధికారం ఉంది కదా అని గిరిజన సొసైటీ ల నిర్ణయాలు లేకుండా వారి అభి ప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా వారి యొక్క లాభ పెక్ష ను దెబ్బ తీస్తూ జులుం ప్రదర్శన చేస్తూ నేనే రాజు నేనే మంత్రి అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆదివాసీలు కు ప్రాతి నిత్యం లేకుండా చేస్తున్న ఆ నేతలు పద్ధతి మార్చుకోక పోతే త్వరలో బహిరంగ ప్రజా పోరాటం ఉంటుంది తుడుందెబ్బ హెచ్చరించింది. అక్రమ ఇసుక మాఫియా ఆగడాలను ఇక సహించేది లేదు అని నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేకంగా నడిచే క్వారీలు, డి సీల్టింగ్ పేరిట అక్రమం ఇసుక క్వారీల భరతం పడతామని అన్నారు, రాత్రి 10 తరువాత ఇసుక లారీలు నడిస్తే ఊరుకునేది లేదు అన్నారు మీ రెవెన్యూ నిధి కోసం మా ప్రాంతం యొక్క రక్తం పీల్చుకు తింటాం అంటే ఊరుకునేది లేదు అన్నారు త్వరలో ఇసుక మాఫియా ఆగడాలపై ఉద్యమ కార్య చరణ తుడుందెబ్బ ఆధ్వర్యం లో చేపడతాం అన్నారు.



# ఘనంగా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవ వేడుకలు



**వీణవంక జూన్ 23( పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రం లో బిజెపి మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవం సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.వారు మాట్లాడుతు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ భారత ఐక్యత, సమగ్రత కోసం జీవితాంతం పోరాడిన మహానేత. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక జెండా, ప్రత్యేక ప్రధానమంత్రి ఉండటాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహీ చలేంగే" అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఉద్యమం నిర్వహించారు. జమ్మూ కాశ్మీర్ పూర్తిగా భారతదేశంలో అంతర్భాగంగా ఉండాలనే లక్ష్యంతో ఆయన పోరాటం సాగించారు. 1953లో పర్మిట్ విధానాన్ని వ్యతిరేకిస్తూ అనుమతి లేకుండా జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన సందర్భంగా ఆయనను అరెస్టు చేసి నిర్బంధించారు. అనంతరం 1953 జూన్ 23న నిర్బంధంలోనే ఆయన మరణించారు. ఆయన త్యాగం దేశ సమగ్రతకు అంకితమైన గొప్ప బలిదానంగా నిలిచిందని బత్తిని నరేష్ గౌడ్ కొనియాడారు.దేశం, ధర్మం, జాతీయ సమైక్యత కోసం తన ప్రాణాలను అర్పించిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఐటీ సెల్ కన్వీనర్ గొడుగు వినోద్,ఎస్ సి మోర్చా మండల అధ్యక్షులు కోలుగురి రమేష్ దామోదర్ బూత్ అధ్యక్షులు మోటం శ్రీనివాస్, కంకల సంతోష్, కూచినపల్లి రాకేష్, పోతుల విజయ్, రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవ కార్యక్రమం

**వీణవంక జూన్ 23( పీపుల్స్ డైరీ) :** మండలంలోని వల్భాపూర్ గ్రామంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బాలవికాస ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అందే శ్రీమతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భర్తలను కోల్పోయిన మహిళల పట్ల ఇంటా, బయటా వివక్ష కొనసాగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్లో విద్య, చైతన్యం పెంపొందితేనే ఇటువంటి దురాచారాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ, అనారోగ్యం లేదా రోడ్డు ప్రమాదాల కారణంగా భర్తలను కోల్పోయిన మహిళలు ఎందుకు సామాజిక శిక్షలు అనుభవించాలని ప్రశ్నించారు. పుట్టుకతో వచ్చిన హక్కులను, సంప్రదాయాల పేరుతో మహిళల నుంచి దూరం చేయడం తగదని వారు అన్నారు. వితంతువుల పట్ల వివక్ష చూపడం నేరమని, పుట్టింటి వారైనా, అత్తింటి వారైనా తమ వైఖరిని మార్చుకోవాలని వారు తెలిపారు. అలాగే, భార్యను కోల్పోయిన పురుషులు పునర్వివాహాలు చేసుకున్నట్లే, భర్తను కోల్పోయిన మహిళలకు కూడా పునర్వివాహాలకు కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందించాలని ఆమె కోరారు. బాలవికాస సభ్యురాలు హైమావతి మాట్లాడుతూ, వితంతువుల పట్ల కొనసాగుతున్న వివక్ష, దురాచారాలను ఇకపై సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కె. సుమలత, ఎ. స్వాతి, ఆసియా తదితరులు పాలుగోన్నారు.



# దళితుడి పైన దాడిని ఖండించిన ప్రజా సంఘాలు

- దళితుడి భూమి కబ్జా ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్న బాధితులు
- దాడి చేసిన వాళ్లపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి



**కమలాపూర్, జూన్ 23( పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల కేంద్రంలోని వంగపల్లి శివారులో ఒక నిరుపేద దళితుడికి చెందిన విలువైన భూమిని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మరికొందరు అక్రమంగా కబ్జా చేస్తున్నారని ప్రజా సంఘాల ఉమ్మడి కార్యాచరణ కమిటీ జేఏసి నాయకుడు మాద సురేష్ ఆరోపించారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాద సురేష్ మీడియాతో మాట్లాడుతూ కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన పోగుల సమ్మయ్య అనే నిరుపేద దళితుడికి వంగపల్లి శివారులోని సర్వే నంబర్లు 890, 897 లో రెండున్నర ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఇంత విలువైన భూమి దళితుడికి ఉండకూడదనే కక్షతో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,గూడూర్ గ్రామానికి చెందిన కొందరు ముదిరాజ్ కులస్థులను రెచ్చగొట్టి దళిత కుటుంబంపై భౌతిక దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. కులం పేరుతో దూషిస్తూ, భూమిలోకి వస్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అక్రమంగా భూమిలోకి ప్రవేశించి విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి, అక్కడ ఉన్న సరిహద్దు రాళ్లను పీకేసి దౌర్జన్యంగా సిమెంట్ పిల్లర్లను నిర్మిస్తున్నారని సురేష్ ధ్వజమెత్తారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కబ్జాపై బాధితుడు పోగుల సమ్మయ్య స్థానిక పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్, అలాగే సీపీ ని పలుమార్లు లిఖితపూర్వకంగా వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని సురేష్ విమర్శించారు. అధికారుల నుంచి స్పందన కరువవడంతోనే ఈరోజు దళిత బహుజన ఫ్రంట్, మాల మహానాడు, ఎం ఆర్ పి ఎస్, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందన్నారు."భూకబ్జాదారులారా ఖబడ్దార్! నిరుపేద దళితుడి భూమిని తక్షణమే వదిలిపెట్టాలి. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి బాధితుడికి సత్వర న్యాయం చేయాలి. మాద సురేష్, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు. ఈ సమస్యపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు కూడా స్పందించి దళిత కుటుంబానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారులు స్పందించి న్యాయం చేయని పక్షంలో, రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఎంతటి త్యాగానికైనా, ప్రాణత్యాగానికైనా సిద్ధమే తప్ప దళితుడి భూమిని వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# గో టు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి- మాదిగలను జాగృతం చేయండి

- "పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన 40 రోజుల కార్యచరణను విజయవంతం చేయండి .



**సైదాపూర్ జూన్ 23 ( పీపుల్స్ డైరీ ) :** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు విద్యా , సంస్థగత నిర్మాణం , జెండా ఆవిష్కరణల కోసం మాదిగ పల్లెల్లోకి ప్రతి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల నాయకులు వెళ్లి అక్కడి మాదిగ యువతను చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ అన్నారు .కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గ్రామం సైదాపూర్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మట్టెల రవీందర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగింది ఎమ్మార్పీఎస్ కరీంనగర్ జిల్లా.ఇంఛార్జి మంద రాజు మాదిగ మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఇచ్చిన కార్యచరణలో భాగంగా గో టు విలేజ్ మాదిగ పల్లెలకు తరలండి కార్యక్రమం ఈనెల 25 నుండి మొదలుకొని జూలై 05 వరకు జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అన్ని మండలాల పరిధిలో ఉన్న గ్రామాలకు నూతన కమిటీల నిర్మాణం జరగాలని అలాగే ఎక్కడైతే గ్రామాలలో నూతన కమిటీలు నిర్మాణం జరగలేదో అక్కడ ఎంఆర్పిఎస్ మరియు ఎంఎస్పి అనుబంధ సంఘాల గ్రామ కమిటీలు నిర్మాణం చేసి అలాగే ఎక్కడైతే గ్రామాలలో ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మాణం జరగలేదో అక్కడ నూతన గద్దెనిర్మాణాలు చేసి ఏదైతే మాదిగలకు పండుగ దినోత్సవం అయినా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జూలై 7 తోని 32వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలు జరిపించి ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థి పాల్గొన్నారు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుల కలవాలా మల్లయ్య మాదిగ ఎం ఎస్ పి సైదాపూర్ మండల అధ్యక్షుడు గాదపాక అశోక్ మాదిగ వి హెచ్ పి ఎస్ . సైదాపూర్ మండల్ ఇన్చార్జి జక్కోజి బిక్షపతి ఎమ్మార్పీఎస్. దుద్దెనపల్లి గ్రామ అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ బోరగాల్ల రమేష్ మాదిగ కొమ్ముల సమ్మయ్య మాదిగ కొమ్ముల శ్రీనివాస్ మాదిగ మట్టల సంపత్ మాదిగ బత్తుల రమేష్ మాదిగ పొడిశెట్టి మొగిలి మాదిగ మహిళా నాయకురాలు గాదెపాక కోమల సమ్మక్క కనకక్క లక్ష్మి స్వరూప ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్న ఉపసర్పంచ్‌లు

- చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- సర్పంచులతో సమానంగా గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేస్తున్న ఉపసర్పంచ్ లు



**కమలాపూర్, జూన్ 23( పీపుల్స్ డైరీ) :**కమలాపూర్ మండల కేంద్రంలో ఉపసర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో రాబోయే 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఎల్లుండి జూన్ 25న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'చలో హైదరాబాద్' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ డిమాండ్ల పోస్టర్లను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఉపసర్పంచుల ముఖ్య డిమాండ్లు, చెక్ పవర్ రద్దుపై స్పష్టత ఉపసర్పంచుల 'చెక్ పవర్' రద్దుపై వస్తున్నటువంటి పుకార్లను, వదంతులను ప్రభుత్వం వెంటనే ఖండించాలని దీనిపై స్పష్టమైన అధికారిక ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం పెంపు సర్పంచులతో సమానంగా ఉపసర్పంచులకు కూడా నెలకు రూ. 5,000 గౌరవ వేతనం అందించాలి. వార్డు సభ్యులకు అలవెన్స్ గ్రామాల్లోని వార్డు సభ్యులకు నెలకు రూ. మూడు వేల చొప్పున అలవెన్స్ అందజేయాలి. "ప్రభుత్వం ఉపసర్పంచుల హక్కులను కాలరా యకుండా, మాకు ఉన్న చెక్ పవర్ అధికారాలపై తక్షణమే స్పష్టత ఇవ్వాలి, సర్పంచులతో సమానంగా గౌరవ వేతనం అందించే వరకు మా పోరాటం ఆగదు." అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, కమలాపూర్. ఉపసర్పంచుల ఐక్యత వర్ధిల్లాలని, 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల ఉపసర్పంచులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు, త్యాగం మరువలేనివి: గంగాడి కృష్ణారెడ్డి



**హుజూరాబాద్, జూన్ 23, (పీపుల్స్ డైరీ) :**భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగం మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గంగాడి కృష్ణారెడ్డి ముందుగా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం" అనే లక్ష్యంతో అహర్నిశలు పోరాడిన గొప్ప దేశభక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ సమగ్రత కోసం ఆయన చేసిన పోరాటం భారత రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం ఉండకూడదని పోరాడుతూ 1953 జూన్ 23న ఆయన కస్టడీలో ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని, ఆర్టికల్ 370 రద్దు ద్వారా ఆయన కలలను సాకారం చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, పట్టణ మాజీ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, సెంట్రల్ ఫిల్మ్ బోర్డు సభ్యుడు సబ్బని రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఎంపీ యుపిఎస్ పాఠశాలల సమస్యలపై పర్యవేక్షించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



**ఏటూరు నాగారం జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని రొయ్యూరు, శంకరాజుపల్లి వీఖురా పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాగటి రవితేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రొయ్యూరు, శంకరాజుపల్లి ఎంపీ పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలు సర్వే చేయడం విద్యార్థుల సమస్యలపై తెలుసుకోవడం జరిగిందని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జాగటి రవితేజ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థులకు ఇప్పటివరకు యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదని, వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకం మెనూ బడ్జెట్‌ను పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సాధారణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పేరిట మైదాన ప్రాంతాలకు తరలించడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో విద్యార్థులకు బోధనకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, ఇటువంటి డిప్యూటేషన్లను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని, లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మూరీ మహేష్, ప్రేమ్ కుమార్, సింహాద్రి, మనోజ్ , స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులుగా కొండబోయిన నాగేశ్వరావు



**సింగరేణి (కారేపల్లి) జూన్ 23 (పీపుల్స్ డైరీ):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా కారేపల్లికి చెందిన కొండబోయిన నాగేశ్వరావు ఎన్నికయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం 4 వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు మహబూబ్ నగర్ లో ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు జరిగాయి. ఈ మహాసభలో సంఘం రాష్ట్ర కమిటీ ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా, వైరా డివిజన్ కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజా సమస్యలలో రాజీలేని పోరాటాలు నిర్వహించిన కొండబోయిన నాగేశ్వరరావు రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ పేదలకు, కూలీ, భూమి, పోడు, ఉపాధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ వ్యవసాయ ,కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తుందన్నారు. పోరాటాల ఫలితంగా అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ హామీల అమలు లక్ష్యంగా పనిచేస్తూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కొండబోయిన నాగేశ్వరరావు రాష్ట్ర కమిటీ ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

# డ్రగ్స్ కు వ్యతిరేకంగా అవగాహన సదస్సు



**ఆళ్ళపల్లి జూన్ 23(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రము లో డ్రగ్స్ వాడకం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్థానిక ఎస్సై సోమేశ్వర్ మంగళవారం నాడు ఈద్గా సెంటర్ లో ప్రజలకు అవగాహన కల్పించారు ఎస్సై సోమేశ్వర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై వివరించారు మత్తు పదార్థాల నియంత్రణలో తల్లిదండ్రులు పెద్దలు కీలక పాత్ర పోషించాలన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# నాణ్యమైన విత్తనాలతోనే మంచి దిగుబడులు సాధ్యం: రొంటాల సుహాసిని మనోజ్ రావు



**హుజూరాబాద్,జూన్ 23, (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వేదికల్లో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మంచి విత్తనం -- మంచి పంటకు మొదటి మెట్టు", "నాణ్యమైన విత్తనం రైతు విజయానికి పునాది" అని పేర్కొన్నారు. రైతుల చేతిలో నాణ్యమైన విత్తనం ఉంటే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని, రైతు చెమటకు విలువ తెచ్చేది మంచి విత్తనమేనని అన్నారు. రైతులు ధృవీకరించిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆమె సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ చతుర్ నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సునీత, వ్యవసాయ అధికారి భూమ్ రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, కౌన్సిలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# కృషి విజ్ఞాన కేంద్రం నందు 5రోజుల శిక్షణ కార్యక్రమం



**జమ్మికుంట. జూన్ 23పీపుల్స్ డైరీ :** (26.06.2026 వరకు) జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నారం ) హైద్రాబాద్ వారి ఆర్థిక సహకారం తో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకం(ఎస్సీ ఎస్పీ) కింద ప్రారంభించడం జరిగింది. రొండవ రోజు ఐన ఈరోజు నారం , హైద్రాబాద్ ప్రధాన శాస్త్రవేత్త ణతీ. నిర్మల పాల్గొని శిక్షణ తీసుకుంటున్న మహిళలకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డా. నిర్మల మాట్లాడుతూ జనప నార (జ్యూట్ బ్యాగ్ ) సంచుల తయారీ ఒక మంచి స్వయం ఉపాధి అవకాశం అని, గ్రామీణ మరియు షెడ్యూల్ కులాల మహిళలు ఈ నైపుణ్యాన్ని ఉపయోగించుకుని ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. అదేవిధంగా, మహిళలు ఆరోగ్య విషయాల పై కూడా శ్రద్ధ వహించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో డా.చీ. వెంకటేశ్వర్ రావ్ సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ కేవీకే జమ్మికుంట మాట్లాడుతూ స్వయం ఉపాధి కార్యక్రమాలు ద్వారా మహిళా సాధికారత సాధ్యం అవుతుందని, ప్రతి ఒక్క మహిళ ఇలాంటి అవకాశాల ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త శ్రీమతి ఏ . ప్రశాంతి, మాస్టర్ ట్రైనర్ శ్రీమతి కే. రాజహంస మరియు 25 మంది షెడ్యూల్ కులాల మహిళలు వివిధ గ్రామాల నుండి పాల్గొన్నారు మరియు వీరికి శిక్షణ నిమిత్తం అవసరమైన సామగ్రి ఇవ్వడం జరిగింది.

## పాఠశాలల బంద్ విజయవంతం



**హుజురాబాద్, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌డీ ప్రాంత కో-కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకుని ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని 27 వేల పాఠశాలలను 4 వేలకు పరిమితం చేస్తామని చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని విద్యార్థుల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సమాఖ్య కార్యదర్శి గౌతమ్, అరుణ్, సత్య, పట్టణ ఉపాధ్యక్షులు సాయి తేజ, సిద్ధు, రాంచరణ్, మారుతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ఆత్మహత్య ..!

**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 23 :** గ్రామపంచాయతీ 25 లక్షల రూపాయల బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులతో మాజీ సర్పంచ్ పిట్టల సంపత్ తన వ్యవసాయ బావి వద్ద ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యకు పాడుపడినట్టు బంధువులు కుటుంబ సభ్యులు తెలిపారు . సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఘటన



స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు విచారణ అనంతరం వెల్లడి కాను ఉన్నాయి. .

## హుస్నాబాద్‌లో విత్తన మేళా ప్రారంభం



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 23 :** హుస్నాబాద్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23 జూన్ నుండి 30 జూన్ 2026 వరకు నిర్వహించనున్న ప్రత్యేక విత్తన మేళాను హుస్నాబాద్ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి వేల్పుల పూజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని డివిజనల్ వ్యవసాయ అధికారి ఎల్. వీణారెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ విత్తన మేళా హుస్నాబాద్, మీర్జాపూర్ రైతు వేదికలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కొనసాగనుంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచారు. వీటిలో కేఎన్ఎం-1638, కె ఎన్ ఎం-7715, ఆర్ ఎన్ ఆర్-15048, జై శ్రీరామ్, బిపిటి-5204 రకాలు ఉన్నాయి. ఈ సన్న రకాల వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్నందునే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సాగు చేయాలని, వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన సన్న రకాల వరి విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను పొందాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జి. వెంకటశివరాం, కే. విజయ్, రైతు నాయకులు గుర్రాల సంజీవరెడ్డి, గంగం సుధాకర్, జొన్నగడ్డల రవీందర్, విత్తన డీలర్లు ,పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో నాణ్యమైన విత్తనాలు



**కమలాపూర్ జూన్ 23( పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండల కేంద్రంలోని గూడూరు రైతు వేదిక నందు వ్యవసాయ అధికారి ఏఓ వేణు ఆధ్వర్యంలో విత్తనమేల కార్యక్రమం నిర్వహించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలు అందిస్తూ రైతులు కల్తీ విత్తనాల బారిన పడకుండా విత్తనమేలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. చెప్పారు. విత్తనమేల లో అందుబాటులో ఉన్న సన్న రకాలు బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 1504, కేఎన్ఎమ్1638,7715, హెచ్ఎంటి సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ 44, రకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రశాంత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రవీందర్, గూడూరు సర్పంచ్ వనజ కళాధర్, సంపత్ రావు, మామిడి శెట్టి శేఖర్, అర్సం సాంబయ్య, పాక కుమారస్వామి, నద్దునూరి సదానందం, రైతులు పాల్గొన్నారు.

## వితంతు వివక్షత నిర్మూలనకు సమాజం ముందుకు రావాలి

- **వితంతు మహిళలకు అండగా బాలవికాస...**
- **బాలవికాస స్వచ్ఛంద సేవా సంస్థ వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు-కేడం లింగమూర్తి**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 23 :** హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వితంతు వివక్షత విముక్తి ఉద్యమ సమాఖ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలవికాస రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 సంవత్సరాల లోపు భర్తను కోల్పోయిన వితంతు మహిళలకు బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక, సామాజిక, విద్యా పరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సూచించిన లింగ సమానత్వ లక్ష్యాల సాధనలో భాగంగా వితంతు మహిళల సాధికారత కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వితంతు మహిళల పిల్లలకు విద్యా సహాయం అందించడంతో పాటు వారి అవస రాలను తీర్చేం దుకు కృషి చేస్తున్నామని, సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పిస్తూ అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. వితంతు మహిళలపై కొనసాగుతున్న వివక్షతను నిర్మూలించి వారికి గౌరవప్రదమైన స్థానం కల్పించడమే బాలవికాస సంస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. బాలవికాస సంస్థ ద్వారా మహిళా పొదుపు సంఘాలు, స్వచ్ఛంద సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నామని, నాగారం గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుం టున్నట్లు వెల్లడించారు. 1977లో స్థాపించబడిన బాలవికాస సంస్థ సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు సేవలం దిస్తోందని తెలిపారు. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు నాగారం గ్రామ సర్పంచ్ ఇజ్జగిరి సంపత్ సహకారంతో బహుమతులు అందజే శారు. సర్పంచ్ సతీమణి విజేత మహిళలకు బహుమ తులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులు, గ్రామ మహిళలు కేడం లింగమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కే .తిరుపతి, వార్డు మెంబర్లు, బాలవికాస కోఆర్డినేటర్లు జ్యోతి, నిర్మల, శ్రీమతి, విలేజి లీడర్ రెడ్డి కళావతి, మండల మహిళా సభ్యులు, వితంతు మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాడు కళకళ... నేడు వెలవెల.-విద్యార్థుల కోసం టీచర్స్ ఎదురు చూపులు

- **రూపిరెడ్డి పల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల దీన స్థితి..**
- **పట్టించుకోని సంబంధిత అధికారులు..**




**రేగొండ జూన్ 23 పీపుల్స్ డైరీ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నాడు విద్యార్థులతో కలకలలాడేది. కానీ ఇప్పుడు విద్యార్థులు లేకపోవడంతో వెలవెలబోతోంది. సుమారుగా 50 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ పాఠశాలలో ఎంతోమంది విద్యావం తులు మేధావులను తయారుచేసిన పాఠశాల ప్రస్తుతం పిల్లలు లేక వెలవేళ బ్టోతోంది పేద విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పంపించడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ ఒకరిని చూసి ఒకరు ప్రయివేట్ పాఠశాలకు పంపించేందుకు తయారు అయ్యారు. ఇలా ఒకరిని చూసి ఒకరు పిల్లల్ని ప్రయివేట్ పాఠశాలలు పంపడం వల్ల ఇప్పుడు ప్రభుత్వ పాఠశాల పిల్లల కోసం టీచర్స్ ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు పిల్లలతో ఉన్న పాఠశాల ఇప్పుడు పిల్లలు లేక చిన్నబ్టోతోంది. పంతమ డబ్బుల ఆలోచిస్తే ఇప్పుడు ఉన్న సమాజంలో చాలా మంది తల్లిదండ్రులు డబ్బులు చూడటం లేదు ప్రెస్టేజి అంటూ ప్రభుత్వ పాఠశాల అంటే అదేదో జైలు మాదిరిగా ఫీల్ అవుతున్నారు.. గ్రామానికి శివారు లో ఈ పాఠశాల ఉంటుంది. చుట్టు పొలాలు పాఠశాల ఆవరణలో ఏపుగా పెరిగిన పచ్చడి చెట్ల మధ్య విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలతో అహల్లా దకరంగా ఉండే సరస్వతి ఆలయం నేడు పిల్లలు లేక వెలవేళ పోతోంది మందు బాబులకు అడ్డాగా అసంగిక కార్యకలాపాలకు అడ్డగా మారింది మద్యం ప్రియులు తరచు ఇక్కడే మద్యం సేవించి కాళీ సీసాలను పగలగొడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై అవగాహన కల్పించి పాఠశాలకు పిల్లలను పంపించేలా చూడాలని ఒక్కసారి పాఠశాల మూత పడితే మల్లి ప్రారంభించాలంటే ప్రాబ్లమ్ అవుతుంది కాబట్టి గ్రామ సర్పంచ్ గ్రామ నాయకులు అలోచించి నిర్ణయం తీసుకో వాలనీ పలువురు కోరుతున్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీఎమ్మెల్యే సతీష్ కుమార్

- **రెవిన్యూ అధికారిగా దేవసాని గణపతి రెడ్డి సేవలు మరువలేనివి..**
- **బత్తిని సత్తయ్య గౌడ్ మృతి పార్టీకి తీరని లోటు**



**చిగురుమామిడి,జూన్23 (పీపుల్స్ డైరీ):** మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసిల్దార్ దేవసాని గణపతి రెడ్డి,సుందరగిరి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తిని సత్తి గౌడ్,సుందరగిరి మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పత్తేం వీరస్వామి భార్య పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే వోడితేల సతీష్ కుమార్ వారి కుటుంబాలను పరామర్శించి వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రిటైర్డ్ తహసిల్దార్ గణపతి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి వారి కుమారులైన దేవసాని శ్రీనివాస్ రెడ్డి,ఫస్ట్ క్లాస్ సివిల్ కాంట్రాక్టర్ దేవసాని కిరణ్ కుమార్ రెడ్డిని వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కమలాపూర్, భీమదేవరపల్లి, మానకొండూర్,తిమ్మాపూర్ లోని ఎల్ఎండిలో తాహాసిల్దార్ గా పనిచేసి 36సంవత్సరాల పాటు ప్రజలకు తనదైన శైలిలో సేవలంది ంచి,మంచి గుర్తింపు తెచ్చుకు న్నారని,గణపతి రెడ్డి మృతి బాధాకరమని చెప్పారు. సుందరగిరిలో బత్తిని సత్తయ్య గౌడ్ మృతి బాధాకరమని,తెలంగాణ ఉద్యమంలో,రైతుల కోసం ఉద్యమించారని గుర్తించారు. ఆధర్య పడవద్దని పార్టీ అండగా ఉంటుందని సత్తయ్య కుమారుడు బత్తిని రవీందర్ గౌడ్ కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటర మణారెడ్డి,సర్పంచ్ జంగ శిరీష రెడ్డి,ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,బీసీ సెల్ మండల అధ్యక్షుడు హనుమడ్ల సత్యనారాయణ, గ్రామ శాఖల అధ్యక్షుడు కొమ్ము కొమురయ్య, ఎస్కే సిరాజ్ పాష, ఎండి సర్వర్ పాషా, కూతురు శరభందన్ రెడ్డి,తాళ్లపల్లి సంపత్ గౌడ్,మక్బుల్ పాషా,కాశవేని నరసయ్య,గందే సంపత్, దోనపాటి కృష్ణారెడ్డి,గందే ప్రశాంత్,పోతరవేణి రాజయ్య యాదవ్,దామ శ్రీనివాస్,పొతరేణి ఆగయ్య,సంధి శ్రీనివాస్ రెడ్డి,రవి,కక్కెర్ల లక్ష్మి,బద్దం మల్లారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై ఫిర్యాదు చేసిన సిపిఐ నేతలు

- **కలెక్టర్ వెంటనే స్పందించి విచారణ జరిపించాలి.**
- **సిపిఐ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ డిమాండ్.**
- **స్థూపం సీలింగ్ భూముల్లోఅక్రమ నిర్మాణాలనువెంటనే**
- **తొలగించాలి-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ డిమాండ్.**



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 23 :** హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని 1189/బి సర్వే నెంబర్8 ఎకరాల భూమిని 1973 లో సీలింగ్ భూములను పట్టేదార్ ముత్తినేని రాంచంద్రరెడ్డి ప్రభుత్వానికి అప్పగించిన తర్వాత పల్లేల్లో దొపిడి దొరలు భూస్వాముల ఆగడాలకు అనునిత్యం బలైపోతున్న పేద ప్రజలకు కమ్యూనిస్టులుగా వారి పక్షాన నిలబడి న్యాయం చేస్తు ప్రజా పోరాటంలో పాలక ప్రభుత్వాల వల్ల అసువులు బాసిన 88 మంది అమరవీరుల స్మృతి చిహ్నంగా 1990లో ఫిపుల్ వార్ ఆసియా ఖండంలో రెండో 88 అడుగుల ఎత్తైన స్థూపాన్ని నిర్మించారని సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాడు సిపిఐ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి ఎఓ పి.రాజు కుమార్ ద్వారా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చినట్లు జాగీర్ సత్యనారాయణ తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ మాట్లాడుతూ అమరవీరుల స్థూపం నిర్మాణం అప్పటి నుండి 3 దశాబ్దాలకు పైగా అట్టి భూమి వైపు ఎవరు కన్నెత్తి కూడా చూడ లేదని 2013 లో భూముల సవరణల సందర్భంగా ఆనాడు సీలింగ్ భూమి కింద ప్రభుత్వానికి అప్పగించిన ముత్తినేని రాంచంద్రరెడ్డి వారసులు ముత్తినేని రాజేశ్వర్ రెడ్డి రెవెన్యూ, భూమి కొలతల అధికారులతో కుమ్మక్కై సీలింగ్ భూమిని యదావిధిగా పట్టా భూమిగా మార్పిడి చేయించుకోని అక్రమంగా పట్టేదార్ పాస్ బుక్ లు పొంది అట్టి భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చెతులు కలిపి స్థానిక ప్రజా ప్రతి నిధుల అండ దండలతో పురపాలక సంఘం అధికారుల సహకారంతో వెంచర్ ఏర్పాటు చేసి లక్షలు కొట్లు గడిస్తున్నారని వెంటనే అమరవీరుల స్థూపం భూముల ఆక్రమణపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని జాగీర్ సత్యనారాయణ గడిపె మల్లేశ్ జిల్లా కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈరి భూమయ్య, నంగి కనకయ్య, ఏగుర్ల కిష్టయ్య, గుడేపు సుదర్శన్, సిద్ధిరాం భద్రయ్య, సిపిఐ గుడెపు సంతోష నాయకులు దండుగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హిమ్మత్ నగర్ కు ఆర్ టీ సి బస్ సౌకర్యం కల్పించాలి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కి వినతి

**వీణవంక జూన్ 23( పీపుల్స్ డైరీ) :** హిమ్మత్ నగర్ లో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా వచ్చిన పాడి కౌశిక్ రెడ్డికి హిమ్మత్ నగర్ స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అదే విధంగా గ్రామానికి గతంలో కరీంనగర్ కు కోరపల్లి,కల్లుపల్లె, కొండపాక, హిమ్మత్ నగర్, రెడ్డి పల్లి గ్రామాల మీదుగా ఆర్ టీ సి బస్సు సౌకర్యం వుండెది. ఈ బస్సు సౌకర్యం లేక జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళడానికి , ప్రధాన హాస్పిటల్ కు పోవడానికి సామాన్య ప్రజలు, విద్యార్థులు , ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి బస్సు సౌకర్యం కల్పించాలని అలాగే గ్రామ పోచమ్మ దేవాలయం దగ్గరికి విద్యుత్ సదుపాయం లేక వీది దీపాల కోసం కరెంట్ స్తంభాలు కెబుల్ ఏర్పాటు చేయాలని హిమ్మత్ నగర్ బిఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కారం చేస్తాను అని తెలిపారు. హిమ్మత్ నగర్ గ్రామ ప్రజలు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ మ్యాక సుమన్ గ్రామ వార్డు సభ్యులు కర్నకంటి నవ్య -భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నల్ల మమత-తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ లు, లకోట రాజవీరు, అంగిడి ఓదేలు, మాజీ ఉపసర్పంచ్ గెల్లు రమేష్,లడె సంపత్ రావు, దాసరి వీరన్న,నల్ల రవీందర్ రెడ్డి,రాచర్ల సమ్మయ్య, కోల రమేష్, నల్ల శ్రీనివాస్ రెడ్డి,దోండపాటి సంపత్ రెడ్డి,మ్యాక మహేందర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాదులోని రోడ్డుకు ట్రంపు పేరు పెట్టడం సిగ్గుచేటు

## ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో నిరసన




**మట్టెవాడ, జూన్ 23 (పీపుల్స్ డైరీ):** ప్రపంచ అశాంతికి ధరల పెరుగుదలకు కారణభూతమైన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరును హైదరాబాదులోని అమెరికా కాన్సులేట్ అవెన్యూ ఆఫీస్ ప్రధాన రహదారికి నామకరణం చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. మంగళవారం ఎంసిపిఐ (యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నానక్ రాంగూడలోని అమెరికా కన్సలైట్సీ ఆఫీస్ రోడ్డుకు డోనాల్డ్ ట్రంప్ పేరును పెట్టడాన్ని నిరసిస్తూ వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్లో ఆందోళన చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి, ట్రంపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన జరిగిన ఆందోళనలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేరుకు ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తున్నామని ప్రచార ఆర్భాటం చేస్తూ ఆచరణలో పెట్టుబడి దారులు, కార్పొరేట్ శక్తులకు వంత పాడుతున్నారని దీనికి తోడు ప్రపంచాన్ని తన కబంధహస్తాల్లో బంధించాలని చూస్తున్న అమెరికా దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలకు దాసోహం అయ్యారని ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెడుతూ అశాంతిని రగిలిస్తూ పెత్తందారి పోకడల తో ప్రజల ప్రాణాలను బలికొంటున్న ట్రంప్ మరోవైపు ధరల పెరుగుదలకు ప్రధాన కారకుడు అయ్యాడని ఇదంతా కళ్ళ ముందు కనబడుతున్నా అందుకు వ్యతిరేకంగా నిలబడి దేశ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పని చేయాల్సిన మోడీ రేవంత్‌లు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయం అన్నారు. దేశంలో, రాష్ట్రంలో అనేకమంది త్యాగధనుల ఫలితంగా దేశానికి స్వాతంత్రం, తెలంగాణ విముక్తి జరిగిందని అలాంటి మహానుభావుల పేర్లను ఎక్కడ నామకరణం చేయకుండా దేశ ప్రజలకు హాని కలిగించే వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ అమెరికాతో చేసుకుంటూ ట్రంప్ పేరును హైదరాబాదు మహానగరంలోని రోడ్డుకు పెడతామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులను మానుకొని రాష్ట్ర దేశ చరిత్రను కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే తగిన గుణపాఠం తప్పదని రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి, సుంచు జగదీశ్వర్, జిల్లా నగర నాయకులు ఎగ్గని మల్లికార్జున్, అప్పనపురి నర్సయ్య, గణిపాక ఓదేలు, మాలి ప్రభాకర్, నలివెల రవి, బిట్ల సమ్మయ్య, రాయినేని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



## డిసిసి ప్రధాన కార్యదర్శిగా గుంటి స్వప్న

**మట్టెవాడ, జూన్ 23 (పీపుల్స్ డైరీ):** ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహించిన డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా గుంటి స్వప్న ప్రమాణ స్వీకారం చేసి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గుంటి స్వప్న మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకంతో డీసీసీ ప్రధాన కార్యదర్శి బాధ్యతను అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజులకు విధేయురాలిగా ఉంటానని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని స్వప్న తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం విద్యకు ఆటంకం కారాదు! - డాక్టర్ అనితారెడ్డి



**మట్టెవాడ, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కె.అనితారెడ్డి అధ్యక్షతన హన్మకొండలోని శాయంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలకు, వీధి బాలల ఆశ్రమం పిల్లలకు ఉచితంగా నోట్ బుక్స్ అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ పేదరికం ఎప్పుడు విద్యకు ఆటంకం కారాదని భావించి పేద పిల్లలకు విద్యకు సహకరించాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. గత 30 సంవత్సరాలుగా ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడమే కాక ఫీజులు సైతం కడుతున్నామని విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు. విద్యా దానం మహా దానం అని ప్రతి ఒక్కరూ పేద పిల్లలకు తోచిన మేర సహాయం చేయాలని అన్నారు. పిల్లలు విద్యని కష్టంగా కాక ఇష్టంగా చదవాలని, విద్య విజ్ఞానాన్నే కాక ఆర్థికంగా మెరుగుపరిచి ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పిల్లలకు చదువు విలువ తెలియచేశారు, బడి వయసు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, సంపూర్ణ అక్షరాస్యత అందరి సమష్టి కృషితో సాధ్యమవుతుందని అనితారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉప్పలయ్య, బస్తీ బడి నిర్వహకులు ఉపేందర్ రెడ్డి, కళ్యాణి, టీచర్స్, విద్యార్థులు , సిబ్బంది పాల్గొన్నారు.

## ఊరచెరువు అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** గోపాల్‌పూర్ ఊరచెరువులో కొనసాగుతున్న డీసిల్టేషన్ (పూడిక తొలగింపు), రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని గోపాల్‌పూర్ ఊరచెరువును సందర్శించిన కలెక్టర్, అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యత, వేగంపై ఇరిగేషన్, జీడబ్ల్యూఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిరంతర పర్యవేక్షణతో చేపట్టాలని అధికారులకు సూచించారు. పరిశీలనలో జీడబ్ల్యూఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు గండి

### ముమ్మరంగా మరమ్మతు పనులు.. పరిశీలించిన కౌన్సిలర్ శ్రీదేవి, అధికారులు

**నర్సంపేట, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట పట్టణంలో గత ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. మల్లంపల్లి రోడ్డులో మెగా గ్యాస్ పైపులైన్ నిర్మాణం కోసం ఐదు రోజుల క్రితం చేపట్టిన తవ్వకాల్లో.. మిషన్ భగీరథ ప్రధాన (మెయిన్) పైపులైన్ పగిలిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో నర్సంపేట పట్టణానికి నీటి సరఫరా పూర్తిగా బంద్ అయింది. ఈ క్రమంలో



మల్లంపల్లి రోడ్డులోని మినీ స్టేడియం వద్ద జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు పనులను 26వ వార్డు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి, పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను వెంటనే తీర్చాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న వారిలో మున్సిపల్ ఏఈ చంద్రమౌళి, పట్టణ వాటర్ సప్లై ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ లతో పాటు స్థానికులు సంకినేని వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**గోవిందరావుపేట, జూన్ 23(పీపుల్స్ డైరీ) :** వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ములుగు జిల్లా హేమంత్ వాసుదేవ్ అన్నారు, మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కాలేజీ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య సిబ్బంది వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకునే జాగ్రత్తల గురించి గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మలేరియా, డెంగ్యూ, డయేరియా ఇలాంటి వ్యాధులను నియంత్రించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి రోజువారి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని, ఏ రకమైన వ్యాధులతో బాధపడుతువారు వస్తున్నారని వివరాలను అడిగి తెలుసుకున్నారు. అ నంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, మందుల నిల్వాలు గదిని, టీకాలు నిల్వల గదులను పరిశీలించా రు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, ఫార్మసిస్ట్ అనుష ల్యాబ్ టెక్నీషియన్ సందీప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు,

# హైదరాబాద్‌ను వెంటనే ఫ్రీ జోన్‌గా ప్రకటించాలి

### డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్




**హైదరాబాద్, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** హైదరాబాద్‌ను వెంటనే ఫ్రీ జోన్‌గా ప్రకటించాలని, స్థానిక యువతకు ఉద్యోగాల్లో న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వివేక్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వివేక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే భారీ స్థాయిలో ఉద్యమాలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని విమర్శించా రు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా ప్రభుత్వం సరైన ప్రణాళికతో ముందుకు సాగడం లేదన్నారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలను దృష్టిలో ఉంచుకుని కేవలం 5 వేల పోస్టుల నోటిఫికేషన్ సరిపోదని, కనీసం 20 వేల పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం చేస్తున్న జీఓ నెం.46ను సవరించి, అభ్యర్థుల ప్రయోజనాలను కాపాడేలా నిర్ణయం



తీసుకోవాలని సూచించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేసి, నియామకాల క్యాలెండర్ ప్రకటించాలని ఆయన కోరారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. "నిరుద్యోగుల గర్జన ప్రభుత్వానికి మంచిది కాదు. యువత ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. హామీల అమలులో విఫలమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలను ఉధృతం చేస్తాం. అవసరమైతే ఈ ప్రభుత్వాన్ని ఎలా గద్దె దించాలో మాకు తెలుసు" అని డాక్టర్ వివేక్ స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు ఇంద్రా నాయక్,చెర్రీ ప్రవీణ్,ఆకాష్ గౌడ్,నవీన్ పట్నాయక్,శింబు నాయక్,భూక్యా కుమార్, ప్రవీణ్, రాజు, జనార్ధన్,గూగులోతు సూర్య ప్రకాష్,సంతోష్ నిరుద్యోగులు పాల్గొన్నారు.

## కల్వాల పాఠశాలలను డీఈఓ ఆకస్మిక తనిఖీ..



**కేసముద్రం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఏ.సత్యనారాయణమూర్తి మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్వాలతో పాటు ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుల పనితీరు, బోధనా విధానాన్ని స్వయంగా తరగతి గదుల్లో విద్యార్థుల మధ్య కూర్చొని పరిశీలించారు. విద్యార్థులతో ఇంగ్లీషులో సంభాషిస్తూ ప్రశ్నలు అడిగి వారి ప్రతిభ, అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. చిన్నారులకు ప్రాథమిక విద్యను సులభంగా అర్థమయ్యే విధంగా నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈఓ ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. తదుపరి డీఈఓతో పాటు కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ రావుల మురళి, అంబటి మహేందర్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్. ఏకాంబరం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కళ్లెం వీరారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్, వి.నాగేందర్,సత్యనారాయణ, సీఆర్పీ ఉదయ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కనకయ్యను విమర్శించడం తగదు



**ఇల్లందు, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** సర్ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యని విమర్శించడం తగదని ఏఎంసీ చైర్మన్ బానోతు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ ఇల్లందు మండల అధ్యక్షులు మండల రామ్ మహేష్ అన్నారు. సర్ ప్రక్రియపై చర్చించాల్సిన సమావేశాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శల వేదికగా మార్చారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లను దొంగిలిస్తోందని బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు నిరాధారమని, ఈ సమావేశం ద్వారా బీజేపీ--బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య బంధం ప్రజలకు బహిర్గతమైందని పేర్కొన్నారు. కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉందో, ఎన్నికల కమిషన్ ఎవరి ఆధ్వర్యంలో పనిచేస్తుందో ప్రజలకు స్పష్టంగా తెలుసని, అలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే కనకయ్య పై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. గత ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్‌కి వచ్చిన ఓట్లు, ఎమ్మెల్యే కనకయ్య కి వచ్చిన మెజారిటీ ఓట్లతో సమానమని గుర్తు చేశారు. ప్రజల ఆదరణతో అంచెలంచెలుగా ఎదిగి రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన కనకయ్య ని విమర్శించే స్థాయి హరిప్రియ నాయక్ కి లేదన్నారు. 100 పడకల ఆసుపత్రి తమ హయాంలో వచ్చిందని చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే, ఆ ఆసుపత్రికి నిధులు ఏ ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయో, భూ సేకరణ ఎవరి పాలనలో జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఇల్లందు నియోజకవర్గంలో ఎవరు ఎంత అభివృద్ధి చేశారో, ఎవరు ఎంత నిధులు తీసుకొచ్చారో ప్రజల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. డిపిఆర్ గురించి ఎమ్మెల్యే కనకయ్య కి తెలియదని విమర్శించే, తమ హయాంలో సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ జరుగుతున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. గార్ల--రాంపురం వంతెన గురించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, శంకుస్థాపనలు చేసిన తర్వాత పనులు ఎందుకు పూర్తి కాలేదో సమాధానం చెప్పాలని అన్నారు. ఎమ్మెల్యే కనకయ్య కృషితో కేంద్ర నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## నాణ్యమైన విత్తనాలు వేసి ఆర్థిక లాభాలు పొందాలి

**కేసముద్రం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఈరోజు నుండి ప్రారంభించిన రైతు విత్తన మేళ కార్యక్రమంలో భాగంగా కేసముద్రం మండలం కల్వాల గ్రామ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించారు, అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక రైతులు పంట మార్పిడి విధానం ద్వారా ముందుకు సాగాలని, సూచించిన బడిన 7 రకాల విత్తనాల ద్వారా రైతులు అధిక దిగుబడులను పొంది ఆర్థికంగా ముందుకు సాగవచ్చని తెలిపారు, యూరియా వాడకం తగ్గించి నానో యూరియా వైపు మొగ్గు చూపాలని, సేంద్రియ ఎరువులు, పంటలు, పామ్ ఆయిల్ వేయాలని, నానో యూరియా వాడకంలో కొత్త ఒరవడిని సృష్టించి డ్రోన్ల ద్వారా స్ప్రే ఇతర కార్యక్రమాలు నిర్వహించవచ్చని అందుకుగాను ప్రతిపాదనలతో వస్తే స్వయం సహాయక బృందాల చేత స్పెషల్ డ్రైవ్ ద్వారా డ్రోన్ల కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
బుధవారం, 24 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 110


# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం




**గణపురం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విత్తన మేళా నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అధికారి దేశపోయిన ఐలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం సిఫార్సు చేసిన 7 సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉండటంతో పాటు,వివిధ పంటలకు సంబం ధించిన నాణ్యమైన విత్తనాలు కూడా రైతులకు విక్రయించబడతాయన్నారు. రైతులు తమ అవస రాలకు అనుగుణంగా వివిధ రకాల విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే సౌకర్యం కల్పించ బడిందనీ, పంటల దిగుబడులను పెంచేందుకు ఉపయోగపడే నానో ఎరువులు కూడా రైతు వేదికలో అందుబాటులో ఉంచబడతా యని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకొని తమకు అవసరమైన విత్తనాలు,నానో ఎరువులను కొనుగోలు చేసుకో వాలని వివరించారు. మండలంలోని రైతులు అందరూ విత్తన మేళాలో పాల్గొని ప్రభుత్వ సేవలను వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొనుగోలు చేసిన రైతులకు సన్నధాన్యం పంపిణీ చేశారు. రైతు మేళ కార్యక్రమం జూన్ 30 వరకు కొనసాగ నుంది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం సీఈఓ పుట్ట సురేష్ ,వైస్ చైర్మన్ సిరిగినేని బాబురావు,వ్యసాయ శాఖ విస్తరణ అధికారి, రైతులు బండారి రాజయ్య, దయ్యాల మల్లయ్య, పచ్చిమట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలి : ఏవో

**మొగుళ్ళపల్లి, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని రైతు వేదికలో మొగుళ్ళపల్లి మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో. వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి "విత్తన మేళా" (సీడ్ మేళా) కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మొగుళ్ళపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, చిట్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ మహమ్మద్ రఫీ, పిఎసిఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు పాల్గొన్నారు. "విత్తన మేళా" 23.జూన్ నుండి 30 జూన్ వరకు మొగుళ్ళపల్లి, పర్లపల్లి రెండు గ్రామాలలోని రైతు వేదికనందు నిర్వహిచనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులకు వానాకాలం వరి సాగుకు అనువైన 7 రకాల (బి పి టి -5204, కె ఎన్ ఎం -1638, ఆర్ ఎన్ ఆర్ -15048, హెచ్ ఎం టి సోనా, జైశ్రీరామ్, డబ్ల్యూ జి ఎల్ -44, కె ఎన్ ఎం -7715) సన్న విత్తనాలను పంపిణీ చేశారు. నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించి వాటిని రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తప్పనిసరిగా ధ్రువీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించడంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని సూచించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి వానాకాలం సీజన్‌ను విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ నుండి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంకుశపురం సర్పంచ్ క్యాతారాజు కవిత లింగమూర్తి, సిఈఓ అప్పం సాగర్ గుండారపు తిరుపతి, రఘుపతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకోవాలి : ఏవో



**చిట్యాల, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వరివిత్తనాలతో పాటు నానో యూరియా నానో డీఏపీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ ఈ విత్తన మేళా ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు కొనసాగు తుందని తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులను సబ్సిడీ ధరలపై పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల ని సూచించారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విత్తనాల వినియోగంతో అధిక దిగుబడులు సాధించాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు చిర్ర సన్నీ గౌడ్ రమణ కుమార్ వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



## డ్రైనేజీలలో చెత్తాచెదారం తొలగింపు

**గణపురం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని పలు కాలనీల డ్రైనేజీలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో కూరుకుపోయి నీరు నిల్వ అవుతుండడంతో స్థానిక సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ మంగళవారం జెసిబితో పిచ్చి మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలోని డ్రైనేజీ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ప్రతి ఒక్కరూ తమ నివాసాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కటుకూరి శ్రీనివాస్, గ్రామస్తులు దూడపాక శ్రీనివాస్, బొమ్మ ప్రదీప్, కోమల, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోండి

### ఏఈఓ చిర్ర సన్నీ గౌడ్



**చిట్యాల, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** రైతులు ఇంకా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొని రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని మండ ల వ్యవసాయ విస్తర ణ అధికారి చిర్ర సన్నీ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేష న్ చేయని రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలకు అర్హులు కాదు అన్నారు. ఆధార్ కార్డు ఆధార్ కార్డు కు లింక్ చేయబడిన మొబైల్ నెంబర్ తీసుకొని చిట్యాల రైతు వేదికలో లేదా మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆమె సూచించారు. పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్



**చిట్యాల, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మండలం లోని జడలపేట శివారు గాంధీ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్న అంకుస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మరియు అదే గ్రామానికి చెందిన రత్న సారయ్య ఇల్లు పిడుగుపాటుకి గురై పూర్తిగా దగ్ధం కావడం జరిగింది. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు బొట్ల రవి ఆధ్వర్యంలో మంగళవారం రెండు కుటుంబాలకు అండగా ఉండే క్రమంలో రెండు బియ్యం బ్యాగ్ లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ జెడ్పిటిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఓరం సమ్మయ్య టిపిసిసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ చైర్మన్ దబ్బేట రమేష్ టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ కార్యదర్శి పుల్యాల గాంధీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య బొట్ల రాజు కాంగ్రెస్ పార్టీ నాయకు లు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాష్



**మట్టెవాడ, జూన్ 23 (పీపుల్స్ డైరీ):** వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వరంగల్ దయానంద్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మీసాల ప్రకాష్ నియమితులయ్యారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతోపాటు ప్రజా సేవా కార్యక్రమాల్లో ఆయన సుదీర్ఘకాలం గా చురుకైన పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ పదవి ఆయనకు దక్కింది. మంత్రి కొండా సురేఖ, కొండా మురళి దంపతులకు ఆప్తుడిగా పేరుగాంచి న మీసాల ప్రకాష్ నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణా ళిక రూపొందించనున్నట్లు ప్రకాష్ వెల్లడించారు. పోటీ పరీ క్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అవసరమైన స్టడీ మెటీరియల్, అత్యాధునిక డిజిటల్ వసతులు అందు బాటులోకి తీసుకురావడం తన ప్రధాన లక్ష్యమని అన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాల యాలను ఆధునీకరించి, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేం దుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖలకు మీసాల ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

### డిఎంహెచ్ఓ మధుసూదన్



**మొగుళ్లపల్లి, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నవత ఆధ్వర్యంలో. అంగన్వాడి టీచర్స్, స్వచ్ఛంద సేవ సంస్థలు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మధుసూదన్ పాల్గొని మాట్లాడుతూ. ఈ నెల 28న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్స్, స్వచ్ఛంద సేవ సంస్థలకు పిహెచ్సి సిబ్బందికి తెలియజేశారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ. 5 సంవత్సరాల వయస్సులోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ నవత మాట్లాడుతూ, మొగుళ్లపల్లి మండల పరిధిలో 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల మొత్తం 3,314 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ కోసం 124 మంది టీమ్ సభ్యులు, సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. మండలంలో మొత్తం 30 పల్స్ పోలియో బూతులను ఏర్పాటు చేసి, మూడు రూట్ల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 ఆదివారం అన్ని బూతులలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయబడతాయని, అనంతరం జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి (హౌస్ టు హౌస్) వెళ్లి బూతులకు రాని లేదా మిస్ అయిన పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు తమ 0-5 సంవత్సరాల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా సమీప పల్స్ పోలియో బూతుకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు, మండల ప్రజలు, వైద్య శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ చిరంజీవి, సీహెచ్‌వో రాజేంద్ర ప్రసాద్, సూపర్వైజర్ సునీత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్‌గా తోకల



**నర్సంపేట, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా సీనియర్ నాయకులు దుగ్గొండి మండలం చాపలబండ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్‌రెడ్డిని నియ మిస్తున్నట్టు శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి తెలిపారు. అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో నేను పార్టీకి చేసిన సేవలను గుర్తించిన శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి నాకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా అవకాశం కల్పించడం సంతోషకరమని అన్నారు. నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ నాయకులను ఏకతాటిపై నడిపించి పార్టీని మరింత బలోపేతం చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. నా ఈ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు..



## డీఎఫ్ఓను మర్యాదపూర్వకంగా కలిసిన గొడిశాల రామనాథం

**పినపాక, జూన్ 23,(పీపుల్స్ డైరీ) :** జిల్లా అటవీ శాఖ అధికారి జి. కృష్ణను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం పోడు భూముల సమస్యపై కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి. కృష్ణ కి శుభాకాంక్షలు తెలియజేసి, శాఖ అభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని రామనాథం పేర్కొన్నారు.

## బీజేపీకి మార్గదర్శక శక్తి శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ

**చిట్యాల, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను ఆశయాలను స్మరించుకుంటూ బిజెపి నాయకులతో కలిసి బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ సాంస్కృతిక ఆర్థిక జాతీయవాదమే పునాదిగా సనాతన ధర్మ రక్షణే ధ్యేయం గా భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి అఖండ భారతమే ఆదర్శంగా ప్రజల సంఘటిత శక్తే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ దో నిశాన్ నహీ చలేగా అనే నినాదంతో దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన ధైర్యశాలి జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్య చైతన్యశీలి అని అన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాలను మరవం వారి ఆశయాలను కొనసాగించడమే వారికీ మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. నేడు వారి వర్ధంతి సందర్భంగా ఆ మహానుభావుడు ఆశయాలను గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ ఓదెల శ్రీహరి కేంసారపు ప్రభాకర్ చెన్నవేని సంపత్ తదితరులు పాల్గొన్నారు.






## కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన

### వైటీపీఎస్‌లో టెండర్ రద్దు చేయాలి

**గణపురం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్ లోని బొగ్గు, బూడిద విభాగాల నిర్వహణను రూ.255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల కాలానికి ప్రైవేట్ సంస్థలకు అప్పగించే టెండర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కేటీపీపీ టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కేటీపీపీ ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టీజీపీఈజేఏసీ ప్రతినిధులు టీజీజెన్కో సిఎండి ని కలిసి, వైటీపీఎస్ బొగ్గు, బూడిద టెండర్ ను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. అయితే యాజమాన్యం నుండి ఎటువంటి సానుకూల స్పందన లభించలేదని. దీంతో టెండర్ రద్దు డిమాండ్ ను మరింత బలంగా వినిపించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీజీట్రాన్స్కో, డిస్కంలు, టీజీజెన్కో విద్యుత్ కేంద్రాలలో భోజన విరామ సమయంలో నిరసనలు చేస్తున్నట్లు టీజీపీఈజేఏసీ నాయకులు తెలిపారు. వైటీపీఎస్‌లో ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను పరిరక్షించాలని, ఉద్యోగుల భవిష్యత్తు, సంస్థ ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
బుధవారం, 24 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 110


## ప్రజాపాలన-ప్రగతి నివేదిక విజయాలను

# కేస్ స్టడీలుగా నమోదు చేయాలి

### 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ప్రత్యేక అధికారి

జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి

ప్రతి శాఖ విజయాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలి

రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై గత ఏడాదితో పోల్చి విశ్లేషణ చేయాలి

గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

ప్రతి శాఖ విజయగాథలు, ఉత్తమ ఫొటోలతో ఐదు రోజుల్లో ప్రత్యేక బుక్‌లెట్ సిద్ధం చేయాలి





**ఖమ్మం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు, ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహ నం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మం జిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాని కి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపా దనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్...



## ఏన్కూరులో విత్తన మేళా ప్రారంభం

**ఏన్కూరు, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు స్థానిక రైతువేదికలో విత్తన మేళాను ఏఎంసీ చైర్మన్ జి.లచ్చిరాం నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి, పెసర, మినుములు, మరియు వివిధ రకాల కూరగాయల నాణ్యమైన విత్తనాలను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే శాస్త్రవేత్తలు డా.పావని, ఫణిశ్రీలు పంటల దిగుబడి పెంచడంలో మట్టి పరీక్షల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించేలా సన్న రకాల సాగు పద్ధతులు, ఆధునిక సాంకేతిక యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నరసింహారావు, ఏఈఓలు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యం

### యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్సై సంధ్య




**ఏన్కూరు, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనే లక్ష్యంగా అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని ఏన్కూరు ఎస్సై సంధ్య కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై జరిగిన కార్యక్రమంలో ఎస్సై ఎన్.సంధ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా, అనేక విధాలుగా నష్టపోతున్నారని అన్నారు. యువత వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం, సామాజిక ఆరోగ్యం ఈ మూడు కలిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం అని ఎస్సై అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత ముందు కు రావాలని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ా× కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, పోలీస్ సిబ్బంది రవి, శంకర్, నరేష్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైభవంగా మొహర్రం వేడుకలు



**ఏన్కూరు, జూన్ 23 పీపుల్స్ డైరీ) :** మండలంలోని రాజలింగాల, టిఎల్ పేట, రేపల్లెవాడ, గార్లఒడ్డు గ్రామాల్లో మతసామరస్యానికి నిలువెత్తు రూపంగా నిలిచే మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ముమ్మరంగా సాగుతున్నాయి. కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జరుపుకునే ఈ పండుగ పల్లెల్లో సరికొత్త ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకువచ్చింది. పలు గ్రామాల్లోని పీర్ల చావళ్ల వద్ద పీర్లను రంగురంగుల మెరిసే కాగితాలు, పూలమాలలు, పట్టు వస్త్రాలతో కనులపండువగా అలంకరించి ప్రతిష్ఠిం చారు. మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తూ హారతులు ఇస్తున్నా రు. పీర్ల చావళ్ల వద్ద భక్తులు తమ కోరికలు నెరవేరాలని 'దట్టీలు' కడు తూ, బెల్లం పానకం, మలిద ముద్దలను నైవేద్యంగా సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రం మాసంలో అత్యంత కీలకమైన 10వ రోజు 'యాషురా' (మొహర్రం పండుగ చివరి రోజు) ఈనెల 26న జరగనుంది. పీర్ల చావిడి వద్ద జరిగే కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం

### వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్





జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం..

వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**ఖమ్మం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగు మట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడ ల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాల కు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడు తున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోం దని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన ప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విష యంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలి క వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతు లు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న "తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం" పోస్టర్‌ను స్థానిక ఎన్7 స్టూడియోస్ లో తెలంగాణ ఉద్యమ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడమర్తి రవి, డాక్టర్ కె.వి.కృష్ణారావు, నందిగామ రాజ్ కుమార్ జానీ, బొబ్బిలి భరత్ చంద్ర, వేల్పుల మురళీ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని, వారి పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. అయితే రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులు నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25,000 గౌరవ పెన్షన్, ప్రత్యేక ఆరోగ్య బీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారుల ప్రత్యేక కోటా, అలాగే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, ఉద్యమకారుల గౌరవ పరిరక్షణ, వారి హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, విద్యార్థి నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సరైన విత్తనం...సమృద్ధి పంటకు పునాది..

### రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం : సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..

**కరకగూడెం, జూన్ 23 (పీపుల్స్ డైరీ) :** రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. మండలంలోని బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, రేగళ్ల సర్పంచ్ బాడిష పార్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించి పంటల ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సాంకేతిక సలహాలను పాటిస్తూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. అనంతరం విత్తన మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వివిధ రకాల విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, బట్టుపల్లి ఉప సర్పంచ్ ఇర్రి వెంకన్న,మాజీ రేగళ్ల ఉప సర్పంచ్ బాడిష లక్ష్మీనారాయణ, ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com